# వొయినం

తెలంగాణ నవల



జాజుల గౌరి



# వోయినం

## తెలంగాణ నవల

జాజుల గౌరి

ప్రచురణ
విశాల సాహిత్య అకాడమీ
హైదరాబాద్ 500013

# నామాట

భారత రాజ్యాంగంలో ప్రతి మనిషికీ ఒకే విలువ, ఒకే ఓటు, స్వేచ్ఛా సమానత్వం, సౌభాతృత్వం, ఆస్తిహక్కు అన్నిట అందరు సమానమేనని ప్రకటించటం జరిగింది. అయినప్పటికీ సామాజికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా, కుటుంబ వ్యవస్థపరంగా, కులపరంగా, అనేక దొంతరల అసమానతలు నేటికీ కొనసాగుతూనే వున్నాయి. పితృస్వామిక సంస్కృతి, పురుషాధిపత్య భావజాలం... మగవాళ్ళలోనే ఎన్నో అసమానతలు... వారిని ఆసరా చేసుకొని భార్యగా వచ్చిన స్త్రీ బతుకు మరింత దుర్భరం. అందరితో సమానంగా స్త్రీకి ప్రాధమిక హక్కులను, అన్ని అధికారాలను చట్టపరంగా ఇచ్చినా నేటికీ అత్యాచారాలతో, హత్యలతో కుటుంబ హింసలతో ఆమె నిరంతరం బలి అవుతూనే వుంది.

నాకు ఊహ తెలిసినప్పటి నుండి గమనిస్తున్న జీవితం ఈ నవలగా రూపొందింది. ఇందులోని నీలమ్మ జీవితం ప్రత్యక్షంగా నేను చూస్తున్నప్పుడు ఒక్కోసారి గుండె ఆగినంత పనయ్యేది. గుండెను చిక్కబట్టుకొని ఆ జీవితాన్ని నా చిన్నతనంలోనే గమనించాను. ఆ తర్వాత ఎందరో స్త్రీల జీవితంలో ఇవే సంఘటనలు పునరావృతం కావటం నన్ను కలిచివేసింది. అలాంటి సంఘర్షణలోంచి నిద్రపట్టని క్షణాలు.. ఈ రచనకు పూనుకునేలా చేశాయి . రచనలు చేస్తున్న మొదటి దశలోనే ఈ నవలని రాశాను. కాని మనస్సులో ఒక సందేహం... నవల మీద అభిప్రాయం ఎలా ఉంటుందో అని!

బి.ఎస్.రాములన్న హైదరాబాద్‌కు వచ్చిన కొత్తలో విద్యానగర్‌లో ఆయనను కలిసి ఈ నవలపై అభిప్రాయం చెప్పమంటూ ఇచ్చాను. అదే రోజు గూడూరి సీతారాంగారు కూడా అక్కడే ఉండి యింకా చాలా రచనలు నీనుండి రావాలి అంటూ దీవించారు.

ఇరవైరోజుల తరువాత బి.ఎస్.రాములన్న నాకు ఫోన్ చేసి నవల మీద తన అభిప్రాయం చెప్పటంతో మనస్సు దూది పింజలా తేలిపోయింది. ఆ రోజంతా నా సంతోషానికి అవధులు లేవు. ఈ నవల నన్ను ఒక రచయిత్రిగా బి. ఎస్. అన్న ముందు నిలబెట్టింది. ఆ సంఘటన నా '**మన్ను బువ్వ**' కథా సంకలనం బి. ఎస్. రాములన్న విశాల సాహిత్య అకాడమి ద్వారా ప్రచురణకు అర్హత సాధించింది. ఆ తరువాత నా రచనలు సాహిత్యం ప్రపంచానికి పరిచయం అయ్యాయి.

రచయిత్రిగా నేను సాహిత్య ప్రపంచానికి పరిచయం కావటానికి ఈ నవల చదివి నన్ను ఎంతో ప్రోత్సహించి నా రచనలు వెలుగు చూడటానికి కారణం అయిన బి. ఎస్. రాములన్న ఋణం నేను తీర్చుకోలేనిది. అందుకే సాహిత్యంలో నాకు మార్గదర్శకాన్ని ఇచ్చిన అన్నకు ఈ నవలని హృదయ పూర్వకంగా అంకితం ఇస్తున్నాను.

# కృతజ్ఞతలు

ఈ నవలని చదివి నాలోని రచయిత్రిని గుర్తించి నన్ను వెన్నుతట్టి ప్రోత్సహించిన బి. ఎస్. రాములన్నకి, గూడూరి సీతారాంగారికి, శ్యామల వదినకి హృదయ పూర్వక సాహిత్యాభివందనాలు...

వొయినం నవల ప్రచురణ రూపంలో రావాలని నిరంతరం నా వెంటపడి ప్రేమగా వేధించిన స్నేహితురాలు డాక్టర్ గీతాంజలికి, నా రచనలు వెలుగు చూడాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించే స్నేహితులకి, ఈ నవలకి ఇంత అందమైన పేరును సూచించిన మిత్రులకి... చక్కని పేయింటింగ్ అందించిన ఏలె లక్ష్మణ్ గారికి... నా శ్రేయోభిలాషులకి స్నేహ పూర్వక సాహిత్యాభివందనాలు.

నన్ను ఇష్టంగా భరించి నా రచనలకు తోడ్పడుతున్న మా ఆయన మునింగం నాగరాజుకు... నా కుటుంబ సభ్యులకి... నా పిల్లలు వసంత పల్లవి, మహేష్ కుమార్, లేఖక్ సిద్దార్థలకు... మనవలు సూర్యప్రభు, ఉదయ్ కుమార్ లకు... ప్రేమ పూర్వక సాహిత్యాభి వందనాలు.

ఈ నవలని డిటిపి చేసి తెలంగాణ భాషకు అందమైన రూపం ఇచ్చిన మిత్రురాలు శారదకు... ఎ. వి. ఎం. గ్రాఫిక్స్ విజయ్ కుమార్‌కు... కవర్ పేజీని అందంగా తీర్చి దిద్దిన అంకుశ్ గ్రాఫిక్స్ వారికి...

ఈ నవల ప్రచురణకై ఆర్థిక సహాయం చేసిన శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారికి కృతజ్ఞతలు...

**జాజుల గౌరి**

# 'వొయినం' ఒక దృశ్య కావ్యం

- బి. ఎస్. రాములు

భారతీయ సాహిత్యంలో గ్రామీణ వ్యవసాయ ఉమ్మడి కుటుంబం గురించి ప్రేమ్‌చంద్ నవలలు మొదలుకొని గత వందేళ్ళుగా అనేక నవలలు వచ్చాయి. వ్యవసాయక గ్రామీణ సమాజం గురించి ఉమ్మడి కుటుంబాల గురించి, మానవ సంబంధాలు, ఆత్మీయత అనురాగాలు, అనుబంధాలు, ఈర్ష్య, అసూయలు, ద్వేషం అనేక కోణాల్లో ప్రేమ్‌చంద్ గోదాన్, రంగభూమి, తదితర నవలల్లో మహోన్నతంగా చిత్రించారు.

తెలుగు 1920వ దశాబ్దంలో ఉన్నవ లక్ష్మీనారాయణ రాసిన "మాలపల్లి" ప్రపంచ సాహిత్యంలో ఒక క్లాసిక్ నవల. ఒరియా భాషలోంచి అనువదించిన "మట్టిమనుషులు" నవలను విశాలాంధ్ర ప్రచురణాలయం దశాబ్దాల క్రితమే ప్రచురించారు. ఫణీశ్వరనాథ్ రాసిన "మైలాంచల్" నవలను నేషనల్ బుక్ ట్రస్ట్ తెలుగు అనువాదాన్ని ప్రచురించింది. 200 యేళ్ళ క్రితం ఎమిలిజోల ఫ్రెంచిలో రాసిన "భూమి" నవలను హైదరాబాద్ బుక్ ట్రస్ట్ తెలుగుచేసి ప్రచురించింది.

ఇలా భారతీయ భాషల్లోను, ప్రపంచ భాషల్లోను వ్యవసాయక సమాజాల గురించి, కుటుంబ సంబంధాల గురించి వందల, వేల కథలు, నవలలు వచ్చాయి. ఇప్పుడు 'వొయినం' నవల వెలువడుతున్నది. ఈ నవలకు ఒక ప్రత్యేకత ఉంది. ఇంతదాకా వచ్చిన కథలు, నవలల్లో లేని అనేక అంశాలు, జీవన విధానం, సాంస్కృతి ఇందులో ఆర్ద్రంగా చిత్రించబడ్డాయి. జానపదుల జీవన శైలిలో పాట ఒక అంతర్భాగంగా కొనసాగుతూ వస్తున్నది. ప్రతి సందర్భంలో జానపదులు పాటలు పాడుకునే క్రమాన్ని ఈ నవలలో సహజంగా చిత్రించారు.

జానపదుల నిత్య జీవితం ఎలా వుంటుందో ఈ నవలలో హృద్యంగా చిత్రించబడింది. జానపదుల జీవితాన్ని ఇంత వివరంగా అనేక కోణాల్లో చిత్రించటం జానపదులకే సాధ్యం. ఈ నవల జానపద దళిత జీవితాన్ని చిత్రించినప్పటికి గ్రామాల్లోని వ్యవసాయ సమాజాలలోని కోట్లాది పేద ప్రజల జీవితాన్ని ప్రతిఫలిస్తుంది. ఏ గ్రామంలోనైనా గ్రామీణ వ్యవసాయ జీవితం ఇంతకన్నా భిన్నంగా ఉండేది కాదు.

ఈ నవలలో పేద మహిళల జీవితం, పరిణామాలు, సంస్కృతి, తెలంగాణ భాష, తెలుగుసాహిత్యంలో అస్తిత్వ చైతన్యంతో చిత్రించబడ్డాయి. తెలంగాణ ప్రజలు రాష్ట్ర రాజధాని పరిసరాల్లో నగర జీవితం కాకుండా గ్రామీణ వ్యవసాయ జీవితం ఎలా జీవిస్తూ వచ్చారో ఈ నవల

మనకు తెలుపుతుంది. సజీవ పాత్రలతో, యథార్థ సంఘటనలకు సాహిత్య రూపమే ఈ నవల.

1970_80 మధ్య సికింద్రాబాద్... లోతుకుంట ప్రాంతంలో పేదల జీవితాలు ఎలా ఉండేవో ఇప్పుడు అర్థంకాకపోవచ్చు. కంటోన్మెంట్‌లో ఏవో చిన్న ఉద్యోగాలు చేస్తున్న తల్లిదండ్రులు, మిలిటరీలో పనిచేస్తున్న అన్న, గారాల బిడ్డ... నీలమ్మ... తల్లిదండ్రులను కోల్పోయి పేద వ్యవసాయ కూలిగా బతుకుతున్న మొగిలి.

భారతీయ సమాజంలో వర్ణవ్యవస్థ, కులవ్యవస్థ వ్యవసాయిక సమాజం పితృస్వామిక కుటుంబ కుదురు అనేక అంతరాలను సృష్టించింది. పేదలు మరింత పేదలుగా చితికిపోవటానికి కులవ్యవస్థతో పాటు పితృస్వామిక సమాజంలో పురుషులు కుటుంబ పెద్దలు తమ స్వార్థం కోసం ఎన్నిరకాలుగా దోపిడీకి పీడనకు పాల్పడుతారో... స్త్రీలపట్ల మరింత అణచివేత ఎలా కొనసాగుతుందో తరతరాలుగా చూస్తూనే ఉన్నాం. తల్లిదండ్రులను, తన పొలాన్ని కోల్పోయిన మొగిలయ్య అతనికి అర్థాంగిగా మారిన నీలమ్మ ఈ కష్టాల గుండా ఎలా పయనిస్తూ వచ్చారో 'వొయినం' నవల చిత్రిస్తుంది.

నిర్మలమైన పేదల హృదయాలు, వారి చిన్న చిన్న ఆశలు, ఆనందాలు వారి పండుగులు, పబ్బాలు ఎంత ఆత్మీయంగా, సహజంగా మానవ సమాజ పరిణామాల్లో భాగంగా కొనసాగుతూ వస్తున్నాయో ఈ నవలలో కరుణార్థంగా చిత్రించారు. డాక్టర్ కేశవరెడ్డి రాసిన "అతడు అడివిని జయించాడు" నవలలోని ఎరుకలి తన ఈనిన పందిని వెతికే క్రమాన్ని పాఠకులు ఆ పాత్రలో లీనమై అన్వేషణ సాగిస్తారు. ఇంగ్లీషులో వచ్చిన ఒక నవలలో కుక్క ప్రధాన పాత్రగా ఉంటుంది. పాఠకులు తానే కుక్కయై నవలలో లీనమౌతారు. వొయినం నవలలోని సంఘటనలు, సన్నివేశాలు, పాత్రలు వారి స్వభావాలు చదువుతుంటే పాఠకులు నవలలోని ప్రధాన పాత్రలైన మొగిలి, నీలమ్మ పాత్రలలో లీనమైపోతారు. ఈ నవల అలా ఒక గొప్ప శైలీ శిల్పాన్ని అలవోకగా సాధించింది.

దళితుల జీవితాల గురించి ఇటీవల అనేక నవలలు వెలువడ్డాయి. ఒక సామాన్య మాదిగ మహిళ కష్టాలను అధిగమించి రచయిత్రిగా ఎదుగుతు మహిళా దృక్పథంతో రాసిన తొలి నవల ఇది. తొలి నవల ఇంత చక్కగా వుండడానికి జీవితాన్ని వాస్తవికంగా దర్శించడమే కారణం.

నేను 1982లో "బ్రతుకుపోరు" నవలలో నేను బీడీ కార్మిక జీవితాలను స్వీయ అనుభవాల క్రమాన్ని చిత్రించాను. కల్లుగీత కార్మికుల జీవితాన్ని స్వీయ జీవిత అనుభవాలను నేరెళ్ళ శ్రీనివాస గౌడ్ "బ్రతుకుతాడు" నవలలో చిత్రించాడు. తెలుగులో వాస్తవిక జీవితాలను నవలలుగా రాయటం వేగం పుంజుకున్నది. మహిళలకే చిత్రించటం సాధ్యం అనుకునే జీవితంలోని అనేక పార్శ్వాలను, పాత్రలను ఆర్ద్రంగా 'వొయినం'లో చిత్రించిన జాజుల గౌరికి హృదయపూర్వక అభినందనలు. ఈ నవలను నాకు

అంకితం ఇవ్వడం గౌరి సహృదయ సంస్కారం...

'హొయినం' నవలలో వర్ణవ్యవస్థకు, కులవ్యవస్థకు అంటరాని వాళ్ళుగా ఉంచబడిన మాదిగల అంటరాని తనం గురించి మిగతా సమాజం చేసే అవమానాల గురించి, అణచివేత గురించి చిత్రించలేదు. తనలో తాను, తనకొరకు తాను జీవించిన జీవితంలో భాగంగా ఇందులోని కుటుంబాలు జీవించిన క్రమానికి పరిమితమై చిత్రించటం వల్ల అంటరానితనం తాలుకు సమస్యలు ఇందులోకి రాలేదు. తద్వారా ఒక లాభం జరిగింది. సన్నకారు వ్యవసాయదారులుగా జీవించే మాదిగలు ఒక స్వయం సంపూర్ణ గ్రామీణ సమాజంగా శతాబ్దాలుగా ఎలా జీవిస్తూ వచ్చారో తెలుసుకోవటానికి ఈ నవల ఉపయోగపడుతుంది. ఇంకా ఎంతో జీవితం చిత్రించాల్సిన అవసరం ఉంది అని నవల చదివాక అనిపిస్తుంది. ముఖ్యంగా నీలమ్మ తల్లిదండ్రుల గురించి, మిలటరీలో పనిచేస్తున్న నీలమ్మ అన్న గురించి, నీలమ్మ పిల్లలు వారి బాల్య చేష్టలు, ఆట పాటలు తల్లిగా నీలమ్మ అనుభూతులు పిల్లలపై మొగిలయ్య అనుబంధం, ఆత్మీయత మొదలైనవి చిత్రిస్తే ఇంకా బాగుండేదనిపిస్తుంది. తొలి నవలలో ఇలా చిన్న చిన్న లోపాలు ఉండడం సహజం.

శివరామకరత్ 1960 రాసిన “తిరిగి మరల సేద్యానికి” నవల ఐదు తరాల గ్రామీణ జీవితాన్ని నగర జీవితాన్ని చిత్రిస్తుంది. వ్యవసాయ సమాజం నుంచి నగరాలకు వలస వెళ్ళి అనేక అనుభవాల తరువాత ఐదో తరం విసిగిపోయి తిరిగి గ్రామాలకు ప్రయాణించడాన్ని అపూర్వంగా చిత్రించింది. జాజుల గౌరి ఈ నవలలో విస్తారమైన జీవితాన్ని చిత్రించే అవకాశం ఉంది. పథేర్ పాంచాలి సిరీస్ వలె నీలమ్మ తరువాత జీవితం వారి పిల్లల జీవితం, ఆధునిక సమాజంలో వారు ఏమైపోతున్నారో మరో నవలగా రాయడం అవసరం.

మాదిగల పెండ్లిలు ఎలా జరుగుతుంటాయో చాలా మందికి తెలియదు. బ్రాహ్మణులు, మంత్రాలు లేకుండా గణతెగల, జనపదాల సామాజిక క్రమంలో సహజంగా రూపుదిద్దుకున్న పెళ్ళి ఎలా వుండేదో పరజ నవలలోను, హొయినం నవలలోను గమనించవచ్చు. వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ ఆధిపత్యవాదులకు భిన్నంగా ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలు శతాబ్దాలుగా స్వతంత్ర్యమైన తమదైన సంస్కృతిని, జీవితాన్ని ప్రత్యేకమైన భాషను, నుడికారాన్ని, సామెతలను ఎలా తమ సంపదగా, వారసత్వంగా కొనసాగిస్తు వస్తున్నాయో ఈ నవల ద్వారా గమనించవచ్చు.

ఇటీవల కాస్త ఎదిగిన ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల పెండ్లిలను మంత్ర తంత్రాలతో బ్రాహ్మణులు ముందుకు వచ్చి చేస్తున్నారు. ఇది వారి వారసత్వాన్ని వదులుకొని వర్ణకుల ఆధిక్యతకి లోను కావాల్సిన సంస్కృతిని స్వీకరిస్తున్నారు. ఎం. ఎన్. శ్రీనివాసన్ ఈ క్రమాన్ని సంస్కృతీకరణ అని నిర్వచించాడు.

స్థానిక భాషల పేర్లను వదిలి సంస్కృత పదాలతో పిల్లలకు పేర్లు పెట్టడం మొదలుకొని పండుగలు, దేవుళ్ళు అన్నిటా తమ స్వీయ సంస్కృతిని వదులుకొని సవర్ణ సమాజ సంస్కృతిని స్వీకరిస్తున్నారు. అందరితో సమానంగా మేమెందుకు ఉండకూడదు అని ప్రశ్నిస్తు ఇలా చేస్తున్నారు. మా కులాలకు కూడా గోత్రాలు ఉండాలి. అవి లేకపోతే సృష్టించాలి. దేవాలయాల్లో గోత్రాలు అడుగుతున్నారు చెప్పటానికి తప్పని సరిగా గోత్రాలు అవసరం అని కొందరు భావిస్తున్నారు. ఇలా ప్రధాన సామాజిక స్రవంతిలో చేరే క్రమంలో తమ సంస్కృతిని, భాషను పోగొట్టుకుంటున్నారు. వదులుకుంటున్నారు. గ్లోబలైజేషన్ పరిణామాలు, ఆధునిక అభివృద్ధి అందుకుంటున్న మేరకు, అంబేద్కర్ చెప్పిన జీవన విధానానికి భిన్నంగా దళిత బహుజనులు ఇలా తమ వారసత్వ సంపదను, భాషను, సంస్కృతిని కోల్పోతువస్తున్నారు. ఇదొక ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న పరిణామం.

ఈ నేపథ్యంలో అస్థిత్వ చైతన్యం మరోవైపున పెరుగుతు వస్తున్నది. తమ గురించి తాము స్వీయ చైతన్యాన్ని పొందాలని, పెంపొందించుకోవాలని, తమ ప్రత్యేకతను నిలబెట్టుకోవాలని ప్రపంచ వ్యాప్తంగా ఆయా ప్రాంతాలు, భాషలు, సామాజిక వర్గాలు, స్త్రీలు, ఆయా దేశాలు అనేక ఉద్యమాలు చేస్తున్నాయి. ప్రజాస్వామీకరణ అనేది తమ అస్థిత్వాన్ని కోల్పోయేదిగా ఉండకూడదని కోరుకుంటున్నారు.

జాజుల గౌరి జీవితం, సాహిత్యం వేరుకాదు. తాను గడిచివచ్చిన జీవితాన్ని సాహిత్యంలో చిత్రిస్తున్న జాజుల గౌరి తెలుసు సాహిత్యంలో మాదిగ దండోరా ఉద్యమ నేపథ్యంలో తనను తాను తెలుసుకుంటూ మా జీవితాలు కూడా సాహిత్య యోగ్యమే అనే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్న రచయిత్రి, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక అధ్యక్షురాలుగా పనిచేస్తున్నారు. అలా దండోరా, దళిత బహుజన జీవితాలనుండి రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో, సాహిత్యంలోను, సామాజిక ఉద్యమంలోను ముఖ్యంగా మహిళా సమస్యల ఉద్యమాలలోను చురుకుగా పాల్గొంటున్నారు.

జాజుల గౌరి కథా రచయిత్రిగా అనేక పురస్కారాలు, ప్రశంసలు అందుకున్నారు. కేంద్ర సాహిత్య అకాడమి, బెంగుళూరు, గుడివాడ, హైదరాబాద్ తదితరసాహిత్య సభల్లో రచయిత్రిగా ఆహ్వానించబడ్డారు. "మనుబువ్వ" కథలసంపుటి విశాల సాహితి, సుశీల నారాయణరెడ్డి ఆర్థిక పురస్కారం, చాసో పురస్కారం అందుకున్నారు. ఇంకా తెలుగు అధికార భాషా సంఘం అవార్డు, పొట్టి శ్రీరాములు, తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం, యద్దనపూడి సులోచనారాణి మాతృమూర్తి పేరిట మహాలక్ష్మమ్మ పురస్కారం, రంగవల్లి మెమోరియల్ ట్రస్ట్ పురస్కారం, ఢిల్లీలోని దళిత సాహిత్య

అకాడమి ద్వారా వీరాంగన సావిత్రిబాయిపులే అవార్డు అందుకున్నారు. ఇలా అనేక పురస్కారాలను అందుకోవడం దళితుల పట్ల సమాజం మారుతున్నదనటానికి ఒక ప్రతీక.

ఇలాంటి సామాజిక పరిణామాల్లో ఈ నవల గడిచివచ్చిన మాదిగల జీవితాన్ని చిత్రిస్తుంది. సికింద్రాబాద్ ప్రాంతంలో 1970_80 మధ్య నగర జీవితంలో ఇలాంటి గ్రామీణ జీవితం కొనసాగడం ఒక ఆసక్తికరమైన అంశం. ఇప్పటికీ వేలాది గ్రామాల్లో ఇదే స్థాయి జీవితం కొనసాగుతూ వస్తున్నది. ఈ జీవితం మారాలని ఎన్నో ఉద్యమాలు చేస్తున్నారు. ఆధునిక అభివృద్ధిలో, ఆధునిక సమాజంలో ఏమాత్రం స్థానంలేని జీవితాలు ఎలా వుంటాయో ఈ నవల కళ్ళకు కట్టిస్తుంది ఈ నవలను ఒక సినిమాగా తీసినా, ఒక టీ.వీ. సీరియల్‌గా తీసినా సత్యజిత్ రాయ్ తీసిన పథేర్ పాంచాలి సినిమా సిరీస్, గౌతమ్ ఘోష్, శ్యామ్ బెనగల్ తీసిన సినిమాల కోవలో ఒక గొప్ప దృశ్య కావ్యం అవుతుంది.

# ఓయినం

తూర్పున వెలుగు రేకలు విచ్చుకొనక ముందే మసక చీకట్లో మేలుకుంది నీలమ్మ.

అప్పటికే తల్లిదండ్రులిద్దరు మిలట్రీలో చీపురు పనికిపోయారు. పక్కనే నిద్రపోతున్న చెల్లెలిపై దుప్పటిని సరిచేసి, బయటకొచ్చి చన్నీళ్ళతో ముఖం కడుక్కొని, పొయ్యి మీదున్న డికాషను గ్లాసులో పోసుకొని తాగింది.

బయట చీకటి తెరలింకా తొలగిపోలేదు.

గుమ్మం దిక్కు చూస్తూనే గిన్నె, గ్లాసు సంచిలో ఏసుకొని చెల్లెలి దగ్గరకు వచ్చి, "ఏ బుజ్జి పన్కి బోతున్న జెల్దీ లెవ్వు" అంటూ లేపింది. బుజ్జి నిద్రలో అటు ఇటు మసులుతూ "గట్లనే నువ్వు పోక్కా మస్తు నిద్రొస్తుంది" అంటూ అటు తిరిగి పడుకుంది.

నీలమ్మ తలుపులు చేరేసి వాకిట్లోకి వచ్చేసరికి ఆకాశంలో చందురుడు పడమటి పయనం కాలేదు, తూర్పున సూరీడు అమ్మవడి నుంచి రాలేదు. తెల్లని వెన్నెల్లో నల్లని నీడను చూస్తూ రివ్వున వీచే చలిగాలికి చిగురుటాకులా ఒన్కుంటూ గిన్నెల సంచిని అదిమి పట్టుకుని బంగాళా దిక్కు సాగిపోయింది.

బంగాళాను చేరేసరికి పొద్దుతిరుగుడు పువ్వులెక్క సూర్య కిరణాలు విచ్చుకుంటున్నాయి.

గచ్చు దగ్గరకు వెళ్ళి తన కోసమే ఎదురుచూస్తున్నట్లున్న వాకిలిని చిమ్మి, నీళ్ళు జల్లి, ముగ్గేసి అంట్లన్ని తోమి, బట్టలుతికే సరికి దొరసాని చాయి తెచ్చి గ్లాసులో పోస్తూ "చాయి తాగవే" అంటు గిన్నెలన్నీ తీసుకొని లోపలికి పోయింది.

రెండు నిమిషాల్లో  చాయి తాగి గదులన్ని ఊడ్చి తుడ్చే సరికి పదకొండైంది.

అప్పటికే దొరసాని సద్దన్నం చారుకూరని గిన్నెల్లో ఏసి అరుగుమీద పెడ్తే వాటిని సంచిలో పెట్టుకొని "అమ్మ నేను పోతున్నా" అంటూ ఇంటికి బయలుదేరింది.

నీలమ్మ యింటికి పోయేసరికి తల్లి తోవలోనే ఎదురొచ్చి "బిడ్డా యింట్లకి పోకు" అని మెల్లగా చెప్పి చేతిలోని సంచిని తీసుకుని చెయ్యి పట్టి పక్కకు తీసుకెళ్తుంటే "ఏందే గీడికి తీసుకొస్తున్నవు" అన్నది.

"బిడ్డా మనింటికి సుట్టాలొచ్చింద్రు గాళ్ళ ముందల నువ్వు గిట్లుంటే బాగుండదు. జెల్దీ జాలట్లకుపోయి తానం జేసిరా" అంటూ పక్కనే తాడుమీద వేసిన బట్టలను చేతికిస్తూ "ఇంగో గియ్యాల గీ లంగ వోణి ఏసుకో" అన్నది.

"లంగ వోణీనాయే నాకు గివి ఎన్కోనికి రాదు, అయినా గివి గిప్పుడెందుకే" అన్నది విషయమేమిటో అర్థంగాక.

'ఓ పిల్లా గియ్యాల గూడా లంగా జాకెట్టు ఏస్కుంటావా ఏది మా తమ్ముడు నిన్ను సూడొచ్చిండు పిల్లా" అంటూ బుగ్గమీద నొక్కి "మా తమ్మునికి నువ్వు మస్తుగా కనపడాలంటే ముద్దుగా తయారుగావాలె" అని పక్కున నవ్వింది వదిన వరుస అయిన సంగమ్మ.

"ఆ గీసూసుడు గీసుడు ఏందోగాని మొన్న పండ్గజేసినప్పుడు గూడా గిట్లనే లంగవోణి ఏసి ఇస్కించింద్రు గది నాకేసుకోనికి రాదొదినా" అన్నది.

"సరే నేనేస్త తియ్యి పోయి బిరాన తానం జేసిరా" అంటూ నీలమ్మను జాలట్లకి నెట్టింది.

"ఓ సంగమ్మ మీ మరదలు తానం జేసినంక జేర మీ యింట్లనే తయారు జేయ్యి. ఒకటే రూంల ఆళ్లముందు పిల్లను ఎట్ల తయారుజేద్దు" అంటూ ఎల్లమ్మ అద్దము, పౌడరు బొట్టు కాటుకను సంగమ్మ చేతిలో పెట్టింది.

అరగంటలో నీలమ్మ చూడొచ్చిన వాళ్ళముందు తలొంచుకుని కూర్చుంది.

అటు పెద్దలు ఇటు పెద్దలు పరస్పరం అబ్బాయిని అమ్మాయిని చూసుకున్నాక తమలో తామే ముచ్చటించుకుంటుంటే అందరికి చాయి అందించింది సంగమ్మ.

అందరు చాయి తాగి సేదతీరాక

"మాకు పిల్ల నచ్చింది. మా యిష్టమే మా కొడుకు ఇష్టం" అని పోచమ్మ అంటుండగానే

"ఇంగ మావోడు మీకు పసందైతే జెప్పుండ్రి పెట్టుపోతలు మాట్లాడుకుని పూలు పండ్లు పెట్టుకుందాం" అంటూ అందరి దిక్కుచూశాడు సత్తయ్య.

సాలయ్య ఎల్లమ్మలకు మొగులయ్య నచ్చాడు. తమ పెద్దలతో మాట్లాడి "పిల్లగాడు మాకు నచ్చిండు. నా బిడ్డను

మీకియ్యనీకి మాకు సమ్మతమే యింగ పెట్టుపోతలు దిక్కెల్లి మీరు మాట్లాడుండ్రి" అన్నడు సాలయ్య.

"ఇంగో పిల్లకు అద్దతులం కమ్మలు, చెయ్యనెత్తు ఓంకు, యింగ పుస్తె మెట్టెలు నేను దేస్తా" అన్నడు సత్తయ్య.

"నా శాతనైన కాడ్కి రెండు మడుముల బాసాన్లు, పావులెత్తు ఉంగరం, ఒక సైకిలు నేనిస్తా" అన్నడు సాలయ్య.

ఇరుపక్షాలకి పెట్టుపోతలు నచ్చాయి.

"ఇంగేందే సత్తెన్న మనకు పిల్ల నచ్చింది. ఆళ్లకు మన పిల్లగాడు నచ్చిండు, ఇక పూలుపండ్లు పెట్టుకొని లగ్గం తారీఖు దీస్తే అయిపోయే" అన్నడు చంద్రయ్య.

సత్తయ్య అక్కడ్నించి లేచి సాలయ్య భుజంమీద చెయ్యేసి బయటకు తీసుకొని పోతుంటే అందరు వాళ్లవెనకే నడిచారు.

బయటకు నడిచిన సత్తయ్య చెట్టుకింద ఆగి

"ఇంగో మా పిల్లగాని దిక్కెల్లి కొన్ని సుద్దులు ముందుగాళ్ళనే మీతోటి జెప్పాలే. ఏదైనా ముందుగాళ్ళ సెప్తనే బాగుంటది లేకపోతే పెండ్లయినంకా గీసుద్ది జెప్పలే, గాసుద్ది జెప్పలే అనొద్దు" అని అంటుంటే

"ఏం సుద్ది" అన్నాడు సాలయ్య.

"గదే ఆని తల్లిదండ్రుల సుద్ది"

"తల్లిదండ్రులు లేరంటిరిగా బావా మల్లమేమేమన్న అంటిమా" అంటుంటే "లేలే మొత్తం కిస్స చెప్తనే బాగుంటది మా మొగిలిగాడు నా తమ్ముని కొడుకు. ఈడు బుడ్డగుండంగానే నా తమ్ముడు సచ్చిపోయిండు. తల్లి ఈడిని ఇడ్సిపోయింది. గప్పట్నించి మా అవ్వ ఈడ్ని సాకింది. ఆమె పోయినకాడి నుంచి ఈడు నా పంచలనే ఉంటుండు. నా సేండ్లనే పన్జేస్తుండు. ఆడికి ఈడొచ్చింది. ఇంగ పెండ్లిజేస్తే ఆడి బతుకు ఆడు బత్కుతడని మీ పిల్ల నడ్గొచ్చినా. ఈని పెండ్లయితే నా బరువు తీర్తది" అంటూ నిట్టూర్చాడు.

"గది సరే బిడ్డా గిదంతా జెప్పినవు. మంచిగనే ఉంది మల్లా పోల్లగానికి యింత పొలం పుట్రా ఏమన్నా ఉన్నదా లేదా" అన్నడు సిద్దయ్య తాత.

"ఇంగోయే తాత నీకాడ దాచేదేముంది మాకు ఎనిమిది ఎకరాల పొలం ఒక పొత్తుల ఉంది. అదిగూడా ఒకటే పట్టకాయితంల ఉంది. గిండ్ల నాలుగు పాళ్ళు. నాలుగు పాళ్లల్లో రెండు పాళ్ళు నాది నా తమ్మునిది. మిగతా రెండు పాళ్ళు ఇంగో మా కాకయ్యల కొడుకులు చంద్రిగానిది, ఎల్లిగానిది, రంగనిది. గట్లనే యింకో తమ్ముడి కొడుకు రాజుగానిది" అంటూ అక్కడే నిల్చొన్న అందర్ని చూయించాడు. "యింగ గిప్పటిదాకా నా పొలం నా తమ్ముని పొలం అంతా నేనే జేస్తుంటి. ఈని పెండ్లయితే ఈని తండ్రిపాలు ఈనికే ఇస్త ఇంకేంది" అన్నాడు.

"ఏంరా సాలయ్య పిల్లగాని దిక్కెలి అన్ని సుద్దులు ఇంటివిగా ఇంగ నీకు సమ్మతమేనా" అన్నాడు ఎంకయ్య.

"అన్నా మీ అందరికి సమ్మతమైతే నాకు సమ్మతమేనే" అంటూ పెద్దవాళ్ల పైననే నిర్ణయాన్ని ఓదిలేశాడు.

"మేమేం అంటంరా పిల్లగానికి పిల్ల సరింగా ఈడుజోడైంది. తల్లిదండ్రులు లేకపోతేంది పెద్దదిక్కుగా ఆళ్ళ పెద్దమ్మ, పెద్దనాయినా కాకయ్యలుండ్రు, బత్కనీకి పొలం ఉంది, ఉండనీకి ఇల్లుంది. యింగ మన పిల్లకేం లోటురా తమ్మి ఇస్తేనే బాగుంటుంది" అన్నడతను.

"సరే మా పెద్దయ్య జెప్పినట్లనే కానింద్రి" అంటూ ఇంట్లోకి దారితీశాడు. కులపెద్దలందరి ముందు అబ్బాయిని, అమ్మాయిని చెరోపక్క కూర్చోబెట్టాక నీలమ్మకు పోచమ్మ పిల్లమాదన్నట్లు బొట్టుపెట్టి, చేతిలో డబ్బులు పెడ్తే, మొగులయ్యకు సాలయ్య బొట్టు పెట్టంగానే.

"ఇంగ మా పిల్ల మీ ఇంటి కోడలు, మీ పిల్లగాడు మా యింటి అల్లుడు" అంటూ సంతోషపడ్డాడు సిద్దయ్య తాత.

అందరి ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది.

★ ★ ★

మరుసటి ఐతారం పూలుపండ్లు పెట్టుకుందామని సత్తయ్య సుట్టాలతో కల్సి సాలయ్య ఇంటికి వచ్చాడు.

మొదట అమ్మాయికి పూలుపండ్లు పెట్టాలని కొత్త చాపలో పీటలేసి నీలమ్మను కూర్చోపెట్టి, నుదుట కుంకుమను దిద్ది తాంబూలంలో తెచ్చిన కొత్త బట్టలను ఒడిలో పెట్టింది పోచమ్మ.

ముత్తైదువలు నీలమ్మకు కొత్తబట్టలు కట్టించి పసుపు, కుంకుమలు, గంధం పెట్టి పాపిట్ల చెమికి అద్దుతుంటే చుట్టు ఉన్న వాళ్ళు "ఏ ఒకపాట పాడుండిరా" అనంటుంటే ముసిముసిగా నవ్వుతూనే ఓ పండు ముసలమ్మ

“మంచి నీళ్ళ బాయికాడా
అంచు లేని ఆకు పుట్టె
ఎంచుకోండ్రి సెలియలారా
ఎంత సోద్యమో

సుక్క బొట్టుపెట్టుకొని
సూర్యచంద్రులెల్లి రాంగ
సూర్యచంద్ర రాజులంతా
సూడ వచ్చిరి

అడ్డ బొట్టుపెట్టుకొని
అరిచ్చెంద్రు లెల్లిరాంగ
అరిచ్చెంద్ర రాజులంతా
అడ్గవచ్చిరి

మేనమామా పంపినాడు
మంచిదైనా పట్టుచీర
సింగులేసి కట్టరమ్మ
చిన్ని చెలియకు

మేనమామా పంపినాడు
మంచిదైనా గుండిరైక
ముద్దుగుమ్మ చెలియకు
తొడుగరమ్మలు

వాడవాడ చెలియలంతా
ఈడుజోడు గూడుకోని
చెలియా నీ కొప్పులోని
చిన్ని మల్లెలు
చెలియా నీ కొప్పులోని
జాజి మల్లెలు”

అని పాడుతుండంగానే ముస్తాబైన నీలమ్మను తీసుకొచ్చి పీటపై కూర్చోబెట్టి పక్కన మరో అమ్మాయిని కూర్చోపెట్టాక తలలో పూలుపెట్టి మెడలో మల్లెల దండ వేసింది సుక్కమ్మ.

పోచమ్మ, సత్తయ్య, సుక్కమ్మ, మల్లమ్మ, కనకమ్మ ఈ ఐదుగురు కల్సి ఒకరెనక ఒకరు నీలమ్మ నుదుట కుంకుమ బొట్టుపెట్టి ఒకేసారి తాంబూలంలోని ఐదు పండ్లు దోసిల్లోకి తీసుకొని ఒడిలో పెట్టి నోట్లో మిఠాయి పెట్టారు. వాళ్ళు పక్కకు తప్పుకోగానే ఒకరేనక ఒకరు భార్యాభర్తలు ఇద్దరిద్దరు వచ్చి వడిలో పండ్లుపెట్టి నీలమ్మ నోరు తీపిచేశారు.

అందరు అయిపోయాకా నీలమ్మను లేపి అదే పీటలపై మొగులయ్యని కూర్చోపెట్టి అమ్మాయి తరపువాళ్ళు కొత్త బట్టలు పెట్టాకా మొగులయ్య వాటిని తొడ్కుకొని పీటలపై కూర్చోగానే నొసట కుంకుమ బొట్టు పెట్టి మెడలో పూలదండేసి చెల్లలో పండ్లుపెట్టి ఒడినింపారు.

పూలుపండ్ల కార్యక్రమం అయ్యాకా బైండ్లయినను తీసుకొచ్చి పెళ్ళి ముహూర్తం నిర్ణయించి లగ్నపత్రికను రాయించారు.

ఆ రోజుకి సరిగ్గా యింకోనెల ఉండేటట్లు పెండ్లి ముహూర్తాన్ని నిర్ణయించాడు బైండ్లయిన.

పెండ్లి, పెళ్ళికొడుకు యింటి దగ్గర జరగాలని పెద్దల మధ్య నిర్ణయం జరిగింది.

పప్పన్నం తిన్నాకా సాయంత్రం అందరు తిరుగు ప్రయాణం అయ్యారు. బస్సులో పోతుంటే మొగులయ్య పక్కనే కూర్చున్న పెద్దయ్య మురిపెంగా చూస్తూ "ఓరి మొగులయ్య యింగ నువ్వు పెండ్లికొడుకువైపోతున్నవన్నమాట" అని అంటుంటే

"అన్న మాటేంటి తాతా గది ఉన్నమాటనే" అంటూ హుషారుగా నవ్వాడు.

"అబ్బో అప్పుడే మొగోడివైనవురో" అంటూ చెవి దగ్గరకు ఓరిగి "పిల్లెట్లుంది పిల్లను బాగా సూస్కున్నావా" అంటూ గేలిచేశాడు.

"లే తాతా" అని సిగ్గు పడ్తూ "నువ్వు జూడ లేదా ఏంది నన్నడ్గుతున్నావు' అంటూ నవ్వుతూ కిటికి దిక్కు ముఖం పెట్టాడు.

"గట్లగాదూ పిల్లగా ఇయ్యలరేపు పోరగాండ్లు పిల్లలను జూసి పెండ్లి జేస్కుంటుండ్రంట నువ్వు గూడ గట్లనే పిల్లను జూస్కున్నావా లేదా" అంటూ మోచేత్తో పొడిచాడు.

"గా సుద్ది పోనీ తాతా ముందుగాళ్ళ గిదిజెప్పు నువ్వు మా అవ్వను జూసే పెండ్లి చేస్కున్నావా" అంటూ ఎదురు ప్రశ్నించేసరికి తాత ముఖంలో ముసిముసి నవ్వు.

"ఓ మీ అవ్వను నేను జూసినా, మీ అవ్వ నన్ను జూసింది" అన్నాడు హుషారుగా. "నువ్వే నయం తాతా గానాడే నువ్వు మా అవ్వను జూసినవుగాని నేను మీ మనవరాల్ని సూడలే" అన్నడు నిజాయితీగా.

మొగులయ్య మాట వినే సరికి పెద్దయ్య పకపకా నవ్వుతూ

"ఓ మొగులయ్య మీ అవ్వ నా మేనమామ బిడ్డరా దాన్ని సిన్నప్పట్నించి నా భుజాల మీద ఎత్తుకున్న, జెర పెద్దగైనంకా ఇద్దరం గల్సి ఆడుకున్నం, పాడుకున్నం, బాయిలల్ల ఈతకొట్టినం, చెట్లమీదెక్కి సీమసింతకాయలు కోసుకుతిన్నం, సింతసెట్లెక్కి సింతసిగురు తెంపుకున్నం ఓనగాయలు కోసుకున్నం ఓరాల మీద ఉర్కులాడి, పోలాలల్ల పొర్లాడినం గింత తిర్గినోల్లం ఏడ రుకాయించినమో దెల్సా" అంటూ మొగులయ్య కళ్ళలోకి చూస్తు నవ్వుతుంటే.

"ఏడ తాతా ఏడ రుకాయించిండ్రే" అని ఆసక్తిగా అడుగుతూ ముందుకు వంగాడు.

"అది సమర్త అయి మూలకు కూకునే తాల్లకు నాముందుగాళ్ళకు రాకపోతుండే యిగ జూసిన అగ జూసిన ఒగపారి యింట్ల ఎవళ్ళు లేనప్పుడు పోయి ఆడుకుందాం రమ్మని సెయ్యి వట్టి గుంజినా గానీ అది శరంతోటి ఉర్కిపోతుండే.

నేనూ దాని ఎనకెనక వడి సందు దొర్కినప్పుదల్లా ఏడ్పిస్తుంటే గిట్లనే రెండు మూడు ఏండ్లయినంకా నేను గూడా రుకాయించే టయిమొచ్చి దాన్ని జూస్తె నాకెందుకో సిగ్గెయ్య వట్టింది. గానీ దొంగతనంగా మీ అవ్వను సూడవట్టినా. యింగ నేనూ గూడ నీ అంత అయ్యేతాళ్ళకు మాకు ఒగనాడు గిట్లనే పూలుపండ్లు పెట్టి లగ్గం జేసిండ్రు" అంటూ ఈ భూమిపై లేని అవ్వ గురించి చెప్తుంటే తాతకళ్ళలోని వెలుగును తదేకంగా చూశాడు.

తన దిక్కే చూస్తున్న మనుమడిని మురిపెంగా చూస్తూ" ఓరి మొగులయ్య నీ పెండ్లాము ముద్దబంతి లెక్కుందిరా మీరిద్దరు సీతారాముండ్ల లెక్కుంటరురా" అన్నడు సంతోషంగా.

★ ★ ★

మర్నాడు పొలంలో మడికి నీళ్ళు మళ్ళించి ఓరం గట్టుమీద కూర్చుంటే రాతికి బస్సులో వస్తున్నప్పుడు తాత అన్నమాటలే మొగులయ్యకు గుర్తుకు రాసాగాయి.

చిన్నప్పట్నించి అవ్వతో ఆడిపాడిన తాతకీ సిగ్గెందుకయ్యిందో అర్థం అయ్యి పెదవులపై చిర్నవ్వు వెలిసింది.

"మరి అంతా తెల్సిగూడ నీలమ్మ ఎదురుగా ఉన్నా తనెందుకు చూడలేదు. అందరి ముందు సూడాలంటే కొంచెం బయం, ఇంకొంచెం బుగులు, గుండేల నుంచి పెయ్యంత పాకుతుంటే, కండ్లు భూమిని తాకినయి. సిగ్గంటే గదేనేమో శరమంటే గదేనేమో, నీలమ్మ అన్న పేరైతే దెల్సుగానీ, మనిసెట్లుంటదో తాత అన్నట్లు ముద్దబంతి లెక్కుంటుందో, చామంతి లెక్కుంటుందో, లేక పోతే పేరున్నట్లనే గీపారే నీళ్ళలెక్కుంటుందో, ఏమో ఎట్లుంటుందో" అని ఆలోచిస్తు మడిలోకి పారే నీళ్ళనూ చూస్తున్న మొగులయ్య ఆలోచనలు నీళ్లలాగే సుడులు తిరుగుతూ ఎత్తు పల్లాలమీద సరసరా సాగిపోతున్నయి.

"మొగిలిగా ఓ మొగిలిగా ఎన్నిసార్లు పిల్వలేబే గంతగనం ఏం సోంచాంచు తున్నావురా. మడ్ల నీళ్ళన్ని నిండి ఓరం దాటి పొర్లిపోతున్నయి పెయ్యిమీద ఓసి లేదేందిరా" అంటున్న పెద్దనాయిన మాట వినేసరికి అదిరి పడి అటుచూశాడు.

కళ్ళు ఎర్రగా చేస్తూ "ఏందిరా బిడ్డా నిన్న తిన్నది యింకా అర్గలేదా ఏంది. ఏందో మస్తు సోంచిల పడిపోయిన వేందిరా యింకా నువ్వు సోంచాంచే పొద్దులు మస్తుగున్నయి గాని మిగిలిన సేనుకి నీళ్ళుపెట్టి మీ పెద్దమ్మెందుకో పిల్సింది బిరాన పో. నేనూ బజారుదాకా పోయొస్తా" అంటూ కోపగిస్తూ ముందుకు కదిలాడు.

మొగులయ్య ముఖం చిన్నబోయింది. పోతున్న పెద్దాయినను చూస్తూ "పెద్దనాయిన ఎప్పుడు గింతే ఏదో ఒక ఒసుగు ఏయ్యందే ఊర్కోడు జెప్పిన పనంతా జేస్త గానీ జెర గలతు అయితే మస్తు తిడ్తడు గిప్పుడు నేనేం తప్పు జేసినానని" అన్కుంటు మరో మడిలోకి నీళ్ళు మలిపాడు.

పొలానికి నీళ్ళు పెట్టి మొగులయ్య యింటికి పోయేసరికి పోచమ్మ వడ్లను సంచులల్ల పోస్తు అతని కోసమే ఎదురు చూస్తోంది.

మొగులయ్య ఇంట్లకి అడుగుపెట్టంగానే "మొగిలిగా, ఓ మొగిలిగా జెర బిరాన బజారుకు పోయి వడ్లు గిర్నిల పట్కరా" అన్నది

ఆకలై కడ్పులో ఎలుకలు పరుగెడుతున్నాయి.

"బువ్వ అంట అడ్గితే పెద్దమ్మ ఏమంటదో" అని అనుకుంటూ వడ్లసంచులకు మూతులు కుట్టి ఎడ్లబండి మీద ఏస్తుంటే పోచమ్మ అన్నం తినమని చెప్పలేదు.

మొగులయ్య ఇక తప్పదని బండిని గిర్ని దగ్గరకు తీసుకుపోయేసరికి అప్పటికే వడ్లసంచులతో గిర్ని నిండిపోయి కన్పించింది.

అయినా ఆశకొద్ది గిర్నివాడి దగ్గరకు వెళ్ళి "అన్నా నాయి అయిదు సంచులే ఉన్నయి గిర్నికి ఏస్తవా" అన్నడు.

ఇగో సూస్తున్నవుగా కత వొస్తే ఒక్కపారే గిన్ని సంచులొస్తయి లేకుంటే లే గియ్యాల పట్టుడు కాదుగాని రెండు రోజులైనంకా రా" అని అంటుంటే

'అన్నా అన్నా ఐదు సంచులేనే జెరెయ్యి" అని బతిమాలాడు.

"అరె తమ్మి అయిదు లేవు. గియిదు లేవు ఓడ్లు పట్టి పట్టి పెయ్యంతా జాన్ జాన్ అయింది. సప్పుడుజేక పో" అంటుంటే నిరాశగా వెనుతిరిగి బండి దగ్గరకు వచ్చి ఆలోచనలో పడ్డాడు.

"వడ్ల సంచులని గిర్నికాడ ఏసిపోదునా తిరిగి ఇంటికి తీస్కపోదునా ఉట్టి సేతులతోటి యింటికి పోతే పెద్దమ్మ ఏమంటదో ముందు ఇంటికి పోయి అడ్గివొచ్చినంకనే ఏదన్నా జెయ్యాలే" అని అనుకొని బండిని గిర్ని ముందరే ఉంచి ఎడ్లను విడిచి పక్కనున్న చెట్టుకు కట్టేసి ఇంటికి పరుగుతీశాడు.

ఆయాస పడ్తు ఉత్తచేతులతో వచ్చిన మొగులయ్యను చూసిన పోచమ్మ 'ఏందిరా గట్ల ఉర్కొస్తున్నవు బండేది బియ్యమేవి" అన్నది.

"గియ్యల గిర్నిల శానా వడ్లున్నయి పెద్దమ్మ గిర్నివోడ్ని శానా బతిమిలాడిన గియ్యాల పట్టుడు గాదన్నడు ఇంగ రెండురోజులైనంకా పడ్తనన్నడు. ఏమంటవోనని అడ్గుదామని వొచ్చిన" అని వగరుస్తూ చెప్తుంటే

"దరిద్రం మొకపోడివి ఏడికిపోయినా గిట్లాంటి అర్కతులే జర్గుతయి తియ్యి మల్ల బండినేడ నాశనం జేసొచ్చినవు" అని కసురుకున్నది.

"గిర్నీ కాడనే ఉంది ఒడ్ల సంచులు ఆడనే ఎయ్యాలనా, తీస్కరావాలనా" అన్నడు ఓనికిపోతూ.

"ఓర్ని ముదనష్టపోడా ఎవలన్నా ఒడ్లసంచులు ఎత్కపోతే ఎట్లరా పోరాపో పోయి బిరాన బండిని తోల్కరా పో" అంటూ గద్దించేసరికి గిర్ని దిక్కు మళ్ళీ పరుగందుకున్నాడు.

ఎర్రటి ఎండలో మొగులయ్య వేగంగా పరిగెత్తుతుంటే ఒళ్ళంతా చెమటలు పట్టి నాలుక పిడుచకట్టుకు పోసాగింది. అయినా వడ్లసంచులు ఏమౌతాయోననే భయంతో మరింత వేగంగా పరుగెత్తి బండి దగ్గరకు పోయేసరికి అక్కడ సత్తయ్య బండినానుకొని కోపంగా నిల్చున్నాడు.

ఆయాసంతో రొప్పుకుంటూ వస్తున్న మొగులయ్యను చూసి "బండిని ఇడ్చి ఏడ్కిపోయి వస్తున్నావురా వడ్లను గిర్నికెయ్యలేదేంది" అన్నాడు.

"పెద్దనాయినా గిర్నీల శానా వడ్లున్నయి గిర్నోడు గియ్యాల మన వడ్లు పట్టనన్నడు గద్కని ఒడ్ల సంచులను గీడనే ఎయ్యాల ఇంటికి తేవాల అని పెద్దమ్మ నడ్గివస్తున్న" అన్నడు వగరుస్తూ.

"అరే బద్మాష్ ఆడు వడ్లు పట్టనంటే నువ్వు ఇంటికి పోతావు బే నడువు ఆడు ఎట్ల నా వడ్లు పట్టన్నడో అడ్గుతా"

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1869**

* * *